# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 | సంచిక : 297 | ఆదివారం 16 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri




## జూలై 24న కేంద్ర బడ్జెట్


- వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కార్
- ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై కసరత్తు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రయత్నాలు
- ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టాలి

న్యూఢిల్లీ

హ్యాట్రిక్ విజయం సాధించి వరుసగా మూడోసారి కొలువుదీరిన మోదీ సర్కార్, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌పై కసరత్తు ప్రారంభించింది. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం జులై 22న ఈ బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం ఉంది. త్వరలో ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాకుండా.. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ కసరత్తులో భాగంగా నార్త్‌బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో సందర్శకుల ప్రవేశంపై ఆంక్షలు ప్రారంభమయ్యాయి. సాధారణంగా ప్రతి ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెడుతారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టిన 'ఓటాన్ అకౌంట్' బడ్జెట్ మాత్రమే ప్రవేశపెట్టాల్సి వచ్చింది. ఇది ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. - మిగతా3లో

# కొత్త కొత్తగా కాంగ్రెస్

- అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ
- ఇప్పటికే ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి అధిష్టానంతో చర్చలు
- కొత్త పీసీసీ విషయంలో ఇప్పటికే తన ఆలోచనలు పంచుకున్న సీఎం
- క్యాబినెట్ విస్తరణ విషయంలో కూడా పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నట్లు సమాచారం
- కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై పార్టీ అధిష్టానం దృష్టి
- పార్టీని నడిపించే నవ నాయకుడి కోసం కసరత్తు



### ఇక టీ కాంగ్రెస్‌పై అధిష్టానం గురి

### తెలంగాణ కాంగ్రెస్‌లో మార్పులు, చేర్పులకు షూరు

ఖమ్మం

పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో మార్పులు, చేర్పులకు వేళ అయింది. అటు పార్టీలో, ఇటు ప్రభుత్వంలో మార్పులకు శ్రీకారం చుట్టాలని భావిస్తోంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికే ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి అధిష్టానంతో చర్చలు జరిపారు. కొత్త పీసీసీ విషయంలో ఇప్పటికే తన ఆలోచనలు పంచుకున్న సీఎం.. క్యాబినెట్ విస్తరణ విషయంలో కూడా పార్టీ అధిష్టానం నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే పీసీసీ మార్పు తర్వాతే ప్రభుత్వంలో మార్పులు చేర్పులు చేయాలని నిర్ణయించినట్లు టాక్. ప్రస్తుతం పీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి ఇటు ప్రభుత్వ అధినేతగా ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారు. ఈ నెల 27తో పీసీసీ చీఫ్‌గా ఆయన మూడేళ్ల పదవీకాలం ముగియనుంది. ఆయన టర్మ్ ముగుస్తుండటంతో.. కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై పార్టీ అధిష్టానం దృష్టిపెట్టింది. పార్టీని నడిపించే నవ నాయకుడి కోసం కసరత్తు చేస్తోంది హైకమాండ్. రెడ్డినా లేక బీసీ నేతకు పార్టీ పగ్గాలు అప్పగించాలా అనేదానిపై - మిగతా3లో




## మోదీ సర్కార్ ఏ క్షణంలోనైనా కూలిపోవచ్చు

- మోదీ సారథ్యంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం పొరపాటున అధికారంలోకి వచ్చింది
- ప్రజలు మోదీ మైనారిటీ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు
- "కేంద్రంలో బలహీనమైన, కిచడీ ప్రభుత్వం ఉంది
- పేకముక్కల్లా ఎప్పుడైనా కుప్పకూలొచ్చు
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే

# కారు కష్టమే!

- కారును కాపాడుకొనేది ఎలా?
- పదేళ్లు తెలంగాణలో నంబర్‌వన్‌గా, తిరుగులేని శక్తిగా ఉన్న పార్టీ..
- ఆరు నెలల క్రితం ఓటరు ఇచ్చిన తీర్పుతో ఇప్పుడు రాజకీయంగా నిలదొక్కుకోవడమే ప్రశ్నార్థకం
- గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కారు స్పీడ్‌కు బ్రేకులు వేయగా.. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికలు.. కారును పంక్చర్ చేసింది.
- బీఆర్ఎస్ పాలనలో జరిగిన స్కామ్‌లు, కుంభకోణాలను వెలికితీయడం మొదలుపెట్టిన కాంగ్రెస్



హైదరాబాద్

ఓడలు బండ్లు అవుతాయి.. బండు ఓడలు అవుతాయి అన్నది సమెత. ఈ సామెత తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం సరిగ్గా సరిపోతుంది. పదేళ్లు తెలంగాణలో నంబర్‌వన్‌గా, తిరుగులేని శక్తిగా ఉన్న పార్టీ.. ఆరు నెలల క్రితం ఓటరు ఇచ్చిన తీర్పుతో ఇప్పుడు రాజకీయంగా నిలదొక్కుకోవడమే ప్రశ్నార్థకమైంది. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలు కారు స్పీడ్‌కు బ్రేకులు వేయగా.. తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికలు.. కారును పంక్చర్ చేసింది. పదేళ్లు తెలంగాణకు తాను ప్రభువును అన్నట్లు వ్యవహరించిన కేసీఆర్ అతని కుటుంబాన్ని ప్రజాస్వామ్యంతో తమకున్న ఓటు అనే ఆయుధంతో - మిగతా3లో

### భారీగా ఐఏఎస్‌ల

# బదిలీలు

- పలువురు కలెక్టర్లకూ స్థాన చలనం
- మొత్తం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లు
- కొత్త ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే తెలంగాణలో జిల్లా కలెక్టర్లను మారుస్తూ ఉత్తర్వులు



## రూ.20 వేల కోట్లు విడుదల

- ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల
- 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం
- దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మంది రైతులు పాల్గొంటారని శివరాజ్ సింగ్ చౌహాన్
- వారణాసిలో ప్రధాని 'సింగిల్ క్లిక్'తో బటన్ నొక్కిన వెంటనే 9.26 కోట్ల మంది రైతులకు లబ్ధి

# హైదరాబాద్ రియల్‌పై ప్రభావం

- భాగ్యనగరం అభివృద్ధిలో ఎప్పుడూ ముందుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.
- ఇక్కడి స్థలాలకు కోట్లాది రూపాయల డిమాండ్లు వచ్చాయి
- అయితే, ఇటీవల రాజకీయ పరిణామాలు పూర్తిగా మారాయి
- ఇది హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ పై తీవ్రంగా ప్రభావం చూపుతుందని విశ్లేషకుల భావన
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో అమరావతిపై ప్రత్యేక దృష్టి పెడతామని స్పష్టంల

హైదరాబాద్

సౌత్‌లో గుర్తింపు ఉన్న నగరం హైదరాబాద్. అన్ని వనరులు ఉన్న భాగ్యనగరం అభివృద్ధిలో ఎప్పుడూ ముందుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక రాష్ట్రం విడిపోయిన తర్వాత మరింత వేగం పుంజుకుంది. హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ భూం రోజు రోజుకు పెరుగుతూనే ఉంది. భాగ్యనగరం చుట్టూ ఉన్న రంగారెడ్డి, మేడ్చల్, తదితర జిల్లాలు కూడా బాగా డెవలప్ అయ్యాయి. ఇక్కడి స్థలాలకు కోట్లాది రూపాయల డిమాండ్లు వచ్చాయి.అయితే, ఇటీవల రాజకీయ పరిణామాలు పూర్తిగా మారాయి. - మిగతా3లో



# బాధిత కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందజేసిన ఎమ్మెల్యే మైపాల్ రెడ్డి






**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మండల పరిధిలోని మంగంపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ కార్యకర్త యోగుల మైపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతి చెందిన కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ప్రమాద బీమా ద్వారా మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును కార్యకర్త కుటుంబానికి అందజేసిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి. కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలిచే ఏకైక పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నాయకోటి రాజేష్, నాగేష్ యాదవ్, నరేందర్, మాచ బోయిన శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ కోఆప్షన్ సభ్యుల జన్మదిన వేడుకలు




**వాస్తవ నేస్తం,కోటగిరి:** ఉమ్మడి కోటగిరి, పోతంగాల్ మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఎం.ఏ హాకీమ్ 60వ జన్మదిన వేడుకలను శనివారం పోతంగల్ మండలంలోని జిల్లాపల్లి ఫారంలో వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, పార్టీ నాయకులు కేక్ కటింగ్ చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎం.ఏ హాకీమ్ మాట్లాడుతూ.. జన్మదిన వేడుకలను పార్టీ అభిమానులు,సీనియర్ నాయకుల మధ్య జరుపు కోవడం సంతోషదాయకమని అన్నారు. తాను పదవిలో ఉన్న లేకున్నా సామాన్య ప్రజానీకానికి కులం,మతం తారతమ్యం లేకుండా సహాయ సహకారాలు సేవా కార్యక్రమాలు చేయడానికి ఎల్లవేళలా ముందుంటానని అన్నారు. మీ అందరి ఆదారాభిమానాలు ఎల్లవేళలా ఇలాగే కొనసాగించాలని ఆయన కోరారు.

## తాటిచెట్టు పైనుండి పడి వ్యక్తి మృతి



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలంలోని తాళ్లరాంపూర్ కు చెందిన బోదాసు గంగాధర్(33) తాటిచెట్టు పైనుండి పడి శనివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తాటికాయలు కోయడానికి చెట్టు ఎక్కిన క్రమంలో కాలు జారిపోవడంతో కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. విషయం గుర్తించిన స్థానికులు క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులున్నారు.

## అలకనంద నదిలో పడిపోయిన టెంపో.. 13 మంది దుర్మరణం



ఉత్తరాఖండ్ రుద్రప్రయాగ్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ టెంపో ట్రావెలర్ అలకనంద నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. కాగా, మరరో 13 మంది గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురిని హెలికాప్టర్లలో ఎయిర్‌లిఫ్ట్ చేసి రిషికేశ్ ఎయిమ్స్‌కు తరలించారు. మృతులు, క్షతగాత్రులు ఢిల్లీ శివారులోని నోయిడాకు చెందిన వారు కాగా.. ప్రమాదం జరిగిన సమయంలో టెంపో ట్రావెలర్‌లో దాదాపు 26 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. రుద్రప్రయాగ్ నగరానికి ఐదు కిలోమీటర్ల ముందు బద్రీనాథ్ హైవేపై రైటోలి సమీపంలో టెంపో ట్రావెలర్ అలకనంద నదిలో పడిపోయింది. సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం, జిల్లా విపత్తు నిర్వహణ, డీడీఆర్ఎఫ్, ఇతర బృందాలు ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్నాయి. అయితే, రైల్వేలైన్‌లో పనిచేస్తున్న ముగ్గురు వ్యక్తులు రక్షించేందుకు నదిలోకి దూకగా.. ఇందులో ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ఘటనపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పర్యాటకులు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. స్థానిక అడ్మినిస్ట్రేషన్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సంఘటనా స్థలంలో సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయని పేర్కొన్నారు.

## వాహనదారులకు కాంగ్రెస్ సర్కారు షాక్..

వాహనదారులకు కాంగ్రెస్ సర్కారు షాకిచ్చింది. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరలను పెంచింది. ఈ మేరకు పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్ పెంచినట్టు కర్ణాటకలోని కాంగ్రెస్ సర్కారు శనివారం మధ్యాహ్నం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పెంపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొంది.

# రూ.20 వేల కోట్లు విడుదల

**న్యూఢిల్లీ:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈనెల 18న వారణాసి లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ప్రధాన్ మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి స్కీమ్ 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల చేయదలనున్నారు. అనంతరం 30,000 సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లకుకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. శనివారంనాడిక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ వివరాలను వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సమన్వయంతో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నరేంద్రమోదీ జూన్ 10న మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తూ పీఎం కిసాన్ నిధి 17వ ఇన్‌స్టాల్‌మెంట్ కింద రూ.20,000 కోట్లు విడుదల చేసేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తద్వారా 9.3 కోట్ల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభించిన ఈ పథకం కింద రైతుల ఆధార్ సీడెడ్ బ్యాంక్ అకౌంట్లకు నేరుగా రూ.6,000 వార్షిక మొత్తంగా జమ అవుతుంది. ఒక్కో ఇన్‌స్టాల్‌కు రూ.2,000 చొప్పున మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్‌గా ఈ మొత్తాన్ని జమచేస్తారు.



**వారణాసి ఈవెంట్‌లో 2.5 కోట్ల మంది రైతులు**

కాగా, 17వ ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.20,000 కోట్లు విడుదల చేసే కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 2.5 కోట్ల మంది రైతులు పాల్గొంటారని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. వారణాసిలో ప్రధాని 'సింగిల్ క్లిక్'తో బటన్ నొక్కిన వెంటనే 9.26 కోట్ల మంది రైతు లబ్ధిదారులకు ఆ మొత్తం చేరుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులను చైతన్యవంతులను చేసేందుకు దేశవ్యాప్తంగా 732 కృషి విజ్ఞాన్ కేంద్రాలు, లక్షకు పైగా ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీలు, 5 లక్షల కామన్ సర్వీస్ సెంటర్లు పాల్గొంటాయని మంత్రి తెలిపారు.

## ఘనంగా మర్రి రాఘవయ్య జన్మదిన వేడుకలు




**– రక్తదాన శిబిరం నిర్వహించిన కార్మికులు**

**వాస్తవ నేస్తం,బోనకల్:** ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ మరియు ఎస్ఇఆర్ఇఎస్ జనరల్ సెక్రెటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య 89 వ పుట్టినరోజు జన్మదిన వేడుకలు మధిర బ్రాంచ్ కార్మికులు ఆధ్వర్యంలో బోనకల్ రైల్వే స్టేషన్ లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ విజయవాడ వారు నిర్వర్తించిన రక్తదాన శిబిరానికి సుమారు 50 మంది కార్మికులు హాజరై ప్రియతమ నాయకుడు మర్రి రాఘవయ్య ఇలాంటి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, పలువురి జీవితాలను నిలబెట్టడానికి ముఖ్యమైన రక్తాన్ని వారు దానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏ.డి. ఏ.ఎన్ మధిర మరియు భద్రాచలం రోడ్ సెక్రటరీ జేమ్స్ పాల్ ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో మధిర బ్రాంచ్ సెక్రటరీ అనిల్ కుమార్ మరియు చైర్మన్ కాశిరెడ్డి మిగిలిన ఆఫీస్ బేరర్స్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఇందిరా గాంధీ భారత మాత'.. కేంద్ర మంత్రి సురేష్ గోపి కితాబు



**తిరువనంతపురం:** కేంద్ర మంత్రి సురేష్ గోపి కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ భారత మాత అని కితాబిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ సీఎం కరుణాకరన్, మార్కిస్ట్ సీనియర్ నేత ఈకే నాయనార్ తన రాజకీయ గురువులని అన్నారు. కేరళలో బీజేపీ నుంచి గెలిచిన ఏకైక ఎంపీ సురేష్ గోపి బుధవారం పున్‌కున్నంలోని కరుణాకరన్ స్మారకం మురళీ మందిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కరుణాకరన్ స్మారకం సందర్శనకు ఎలాంటి రాజకీయాలు జోడించవద్దని మీడియాను కోరారు. తన గురువుకు నివాళి అర్పించేందుకే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. కాగా, మార్కిస్ట్ సీనియర్ నేత ఈకే నాయనార్, ఆయన భార్య శారద టీచర్ మాదిరిగా కరుణాకరన్, ఆయన భార్య కల్యాణికుట్టి అమ్మతో తమ కుటుంబానికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నటుడి నుంచి రాజకీయ నేతగా మారిన సురేష్ గోపి తెలిపారు. జూన్ 12న కుటుంబ సభ్యులతో కలిసి కన్నూర్‌లోని నాయనార్ ఇంటికి కూడా ఆయన వెళ్లారు. మరోవైపు ఇందిరా గాంధీని భారత మాతగా తాను భావిస్తానని సురేష్ గోపి చెప్పారు. అలాగే కరుణాకరన్‌ను కేరళ కాంగ్రెస్ తండ్రిగా ఆయన అభివర్ణించారు. కరుణాకరన్ ధైర్యవంతమైన పాలకుడని ప్రశంసించారు. లోక్‌సభ ఎన్నికల్లో త్రిసూర్ నుంచి పోటీ చేసిన సురేష్ గోపీ బీజేపీ అభ్యర్థిగా గెలిచారు. ఆయనపై బరిలో నిలిచిన కరుణాకరన్ కుమారుడు, కాంగ్రెస్ అభ్యర్థి కే మురళీధరన్ మూడో స్థానానికి పరిమితమయ్యారు.

## సామూహిక అక్షర అభ్యాసం ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం పటాన్చెరు మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలో గల ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సామూహిక అక్షర అభ్యాసం కార్యక్రమాన్ని ప్రారంభించిన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సుప్రజా వెంకట్ రెడ్డి, ఎంపీటీసీలు మంజుల శ్రీశైలం, మాధవి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, మాజీ సర్పంచ్ చిన్న రాములు, మాజీ ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లిన వ్యక్తి

**ముంబై:** లోక్‌సభ ఎన్నికల ఫలితాల రోజున కౌంటింగ్ సెంటర్‌లోకి ఒక వ్యక్తి మొబైల్ ఫోన్ తీసుకెళ్లాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో ఎన్నికల్లో గెలిచిన ఎంపీ బంధువుపై కేసు నమోదైంది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. ముంబై నార్త్-వెస్ట్ నియోజకవర్గం నుంచి కొత్తగా ఎన్నికైన శివసేన ఎంపీ రవీంద్ర వైకర్ బంధువు మంగేష్ పాండిల్కర్ జూన్ 4న గోరేగావ్‌లోని కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లారు. భారత్ జన్ ఆధార్ పార్టీ అభ్యర్థి అరోరా సురీందర్ మోహన్ దీనిపై వాన్రాయ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శివసేన ఎంపీ రవీంద్ర వైకర్ బంధువైన మంగేష్ పాండిల్కర్‌తోపాటు పోలింగ్ సిబ్బంది దినేష్ గురవ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, శివసేన (యూబీటీ) అభ్యర్థి అమోల్ కీర్తికర్ కూడా కౌంటింగ్ తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. శివసేన ఎంపీ రవీంద్ర వైకర్ గెలుపును బాంబే హైకోర్టులో సవాలు చేయాలని ఆయన భావిస్తున్నారు. అయితే కౌంటింగ్ సెంటర్‌లోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లిన ఎంపీ రవీంద్ర వైకర్ బంధువైన మంగేష్ పాండిల్కర్‌పై ఆయన ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.



## పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న చింత సాయి నాథ్



**వాస్తవ నేస్తం,సంగారెడ్డి:** సదాశివపేట ఏంఈఓ దండు అంజయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమం సంగారెడ్డి పిఎస్ఆర్ గార్డెన్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు చింతా సాయినాథ్ పాల్గొన్ని ఏంఈఓ దండు అంజయ్య దంపతులను సన్మానించారు. జాతీయ అవార్డు గ్రహీత రక్తదాత , బాల కార్మికులను పాఠశాలలో చేర్పించిన పేదల గురువు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సదాశివపేట మున్సిపల్ చైర్ చైర్మన్ చింతా గోపాల్ పాల్గొన్నారు.

## మంత్రి కొండ సురేఖను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**వాస్తవ నేస్తం,ఇచ్చోడ:** మండలంలోని సిరిచెల్మ గ్రామ పరిధిలో పేద ప్రజలు పోడు వ్యవసాయం చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, ఫారెస్ట్ అధికారులు పోడు భూముల్లో చేస్తున్న అభివృద్ధి పనులను ఆపివేయాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేష్, బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆడే గజేందర్ ల ఆధ్వర్యంలో మంత్రి కొండ సురేఖను కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిశారు. పేద ప్రజలకు న్యాయం చేస్తామని మంత్రి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో సిరిచెల్మ ఉప సర్పంచ్ అబ్దుల్ అజీమ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు షబ్బీర్, తదితరులు ఉన్నారు.



# కొత్త కొత్తగా కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి

చర్చోపచర్చలు జరుపుతోంది. తెలంగాణలో పార్టీ అధికారంలో ఉండటంతో.. పీసీసీ చీఫ్ రేసులో చాలామంది నేతలే ఉన్నారు. ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్న నేతలు కూడా పార్టీ అధ్యక్ష పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.తెలంగాణలో కూడా కర్ణాటక తరహా పార్టీ పగ్గాలు అప్పగించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరుతున్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. పీసీసీ చీఫ్ కూడా కొనసాగుతున్నారు. ఇక్కడ కూడా పీసీసీ పగ్గాలు తనకు అప్పగించాలని భట్టి పట్టుబడుతున్నారు. ఇక సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని పీసీసీ చీఫ్ నియామకం ఉండే అవకాశాలు ఉండటంతో..బీసీ నేతలు తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు.బీసీ సామాజికవర్గం నుంచి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ పీసీసీ చీఫ్ రేసులో ఉన్నారు. బీసీ సామాజిక వర్గం నుంచే జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, మాజీ అంజన్ కుమార్ యాదవ్ పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి. ఇక ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్, ఎస్టీ సామాజిక వర్గం నుంచి మంత్రి సీతక్క, ఎంపీ బలరాం నాయక్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి.పీసీసీ రేసులో తెరపైకి వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, సీతక్కలు ఇప్పటికే ప్రభుత్వంలో ఉన్నారు. వీరిలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాత్రం మంత్రి పదవి లేకపోయినా.. పీసీసీ చీఫ్ కావాలని అడుగుతున్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. మిగతా ఇద్దరు భట్టి, సీతక్క మంత్రి పదవులు వదులుకోవడానికి సిద్ధపడటం లేదని తెలుస్తోంది.పీసీసీ చీఫ్ విషయంపై త్వరలోనే కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. ఈ నెలాఖరులోపే




అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని భావిస్తున్నారు హస్తం పార్టీ నేతలు. పీసీసీ చీఫ్ నియామకంపై స్పష్టత వచ్చిన తర్వాత ప్రభుత్వంలో కూడా మార్పులు, చేర్పులు చేసే చాన్సుంది. పీసీసీ చీఫ్‌తో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్లు, జాతీయ స్థాయిలో పార్టీ జనరల్ సెక్రటరీలు, ఇతర ముఖ్యపోస్టుల భర్తీని దృష్టిలో పెట్టుకొని క్యాబినెట్ విస్తరణ ఉండనున్నట్లు చర్చ జరుగుతోంది.క్యాబినెట్‌లో ప్రస్తుతం సీఎంతో పాటు 11 మంది మంత్రులున్నారు. ఇంకా ఆరుగురిని మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. మిగతా ఆరుగురు మంత్రులను సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా తీసుకునే అవకాశం ఉన్నట్లు టాక్ వినిపిస్తోంది. సీఎంకు అనుకూలంగా ఉన్న నేతలతో పాటు..కొన్ని సామాజికవర్గాలకు అవకాశం కల్పించడం, ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో సీనియర్ నేతలకు అవకాశం కల్పించాలని చూస్తున్నారు.పీసీసీ చీఫ్ నియామకం జరిగితే కానీ..క్యాబినెట్ విస్తరణ జరిగే అవకాశం లేదంటున్నారు హస్తం పార్టీ లీడర్లు. పార్టీ పదవులు దక్కనివారికి క్యాబినెట్ బెర్తులు దక్కే చాన్స్ ఉండదంటున్నారు. ఒకవేళ పీసీసీ, ఏఐసీసీలో పదవులు దక్కితేవారికి క్యాబినెట్ విస్తరణలో చోటు దక్కే అవకాశం లేదని అంటున్నారు కాంగ్రెస్ లీడర్లు.

# కారు కష్టమే!

-మొదటిపేజీ తరువాయి

కిందకు దించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదు. ఇదే తరుణంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ బీఆర్ఎస్ పాలనలో జరిగిన స్కామ్‌లు, కుంభకోణాలను వెలికితీయడం మొదలు పెట్టింది. మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా ఢిల్లీ లిక్క స్కాం కేసులో కీలకంగా ఉన్న కేసీఆర్ కూతురును అరెస్టు చేసి జైలుకు పంపింది. దీంతో బీఆర్ఎస్‌కు చెందిన నేతలు ఇక ఆ పార్టీలో భవిష్యత్ లేదని కాంగ్రెస్, బీజేపీబాట పట్టారు.ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా.. లోక్‌సభ ఎన్నికల్లో ఉనికి చాటుకోవాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావించారు. దీంతో ఆయనే స్వయంగా బస్సుయాత్ర ద్వారా ఎన్నికల ప్రచారం చేశారు. మరోవైపు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుని గత ప్రభుత్వం చేసిన అన్ని కుంభకోణాలను అనతికాలంలోనే బయటపెట్టింది. ఇది లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కారణమైంది. ఇక లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో మోదీ వేవ్ బాగా పనిచేసింది. కవితను అరెస్టు చేయకుండా అసెంబ్లీ ఎన్నికల్లో నష్టపోయిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం పుంజుకుంది. అధికార కాంగ్రెస్‌తో సమానంగా సీట్లు గెలుచుకుంది. దీంతో బీఆర్ఎస్ ఒక్క సీటు కూడా దక్కించుకోలేక చతికిలపడింది.ఒకవైపు అధికార కాంగ్రెస్, మరోవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో నువ్వా నేనా అన్నట్లు తలపడ్డాయి. ఈ రెండు జాతీయ పార్టీలో దూకుడును ఉదుర్కొనేందుకు కేసీఆర్ ప్రయత్నం చేసినా.. తెలంగాణ ఓటర్లు బీఆర్ఎస్‌ను పరిగణనలోకి తీసుకోలేదు. కేసీఆర్ పదేళ్లలో తప్పు చేశారని



భావించారు. మరోవైపు ప్రస్తుతం బీఆర్ఎస్‌ను గెలిపించినా లాభం లేదన్న అభిప్రాయం తెలంగాణలో ఏర్పడింది. ఫలితంగా లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా సాధించలేదు. కేసీఆర్ బస్సుయాత్ర కూడా ఎలాంటి ప్రభావం చూపలేకపోయింది. ఆ పార్టీ సున్నా సీట్లు గెలుచుకుంది.అసెంబ్లీ ఎన్నికల తర్వాతనే చాలా మంది నేతలు బీఆర్ఎస్‌ను వీడారు. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఒక్క సీటు కూడా గెలవకపోవడంతో పార్టీ పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. దీంతో ఆ పార్టీలో ఉన్న నేతలు కూడా ఇప్పుడు పక్క చూపులు చూస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో టచ్‌లోకి వెళ్లారు. ఈ పరిస్థితిలో పార్టీని నిలబెట్టుకోవడం కేసీఆర్ ముందు ఉన్న పెద్ద సవాల్.

# హైదరాబాద్ రియల్‌పై ప్రభావం...

-మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు అత్యంత ఎన్నికయ్యారు. ఇటీవల ప్రమాణ స్వీకారం చేసిన ఆయన అమరావతిపై ప్రత్యేక దృష్టి పెడతామని స్పష్టం చేశారు. ఇది తెలంగాణ రాజధాని హైదరాబాద్ రియల్ ఎస్టేట్ డైనమిక్స్ ను మార్చవచ్చు అని నిపుణులు అంచనాలు వేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం పార్టీకి గణనీయమైన మెజారిటీ వచ్చింది. పైగా కేంద్రంలో ప్రధాన మిత్రపక్షంగా ఉండడం వల్ల పెద్ద ఎత్తున అమరావతికి పెట్టుబడులు రానున్నాయి. ఇది హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ పై తీవ్రంగా ప్రభావం చూపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక్కడి రియల్ సంస్థలు అమరావతికి షిఫ్ట్ కావచ్చన్న ఊహాగానాలు కూడా వెలువడుతున్నాయి. అనేక మంది పెట్టుబడిదారులు, వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ కు వలస వెళ్లే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.ఇది హైదరాబాద్ నుంచి కొంత పెట్టుబడులను ఆకర్షించవచ్చని, దీని వల్ల తెలంగాణ రాజధాని రియల్ ఎస్టేట్ ధరలు 10-15 శాతం మేర తగ్గే ఛాన్స్ ఉందని వాణిజ్య స్థిరాస్తి మార్కెట్ క్షీణించే అవకాశం కూడా లేకపోలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.హైదరాబాద్ రియల్ ఎస్టేట్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కారణం కాగలదని రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ చేసిన పరిశోధనలో వెల్లడైంది. అయితే, ఆంధ్రప్రదేశ్ కు భారీ పెట్టుబడులు తీసుకువచ్చే దిశగా చంద్రబాబు ప్రణాళికలు రెడీ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో భాగ్యనగరం రియల్ పెట్టుబడి దారులను ఏపీ ఆకర్షించే అవకాశం ఉన్నందున హైదరాబాద్ పై సానుకూల ప్రభావం పడుతుందని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతి ఉంటుందని జూన్ 11న చంద్రబాబు నాయుడు ప్రకటించారు.2014లో ఆంధ్రప్రదేశ్ విడిపోయినప్పుడు చంద్రబాబు అమరావతి కోసం భారీ ప్రణాళికలు రూపొందించాడు. 2014 నుంచి 2019 వరకు ఆంధ్రప్రదేశ్ కు తొలి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమరావతిని రాజధానిగా చేయాలనే ఆలోచనను తెరపైకి తెచ్చారు. అయితే, 2019లో టీడీపీ అధికారం కోల్పోయి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్ఆర్సీపీ విజయం సాధించడంతో ఆ ఆలోచన విరమించుకుంది.

**భూముల ధరల పెంపుదలపై మధనం**

తెలంగాణలో పదేళ్లు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఆరు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలో 400కుపైగా హామీలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా.. ఆరు గ్యారంటీలు అమలు కాలేదు. మరోవైపు మేనిఫెస్టోలోని హామీలు అమలు చేయాల్సిన అవసరం ఉంది. లోక్‌సభ ఎన్నికలు కూడా ముగియడంతో సీఎం రేవంత్‌రెడ్డి హామీల అమలుపై దృష్టిపెట్టారు.ప్రస్తుతం రేవంత్‌రెడ్డి రుణమాఫీకి సుదీర్ఘ కసరత్తు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన నిధులు సమీకరణపై దృష్టిపెట్టారు. రుణమాఫీ అర్హులను గుర్తించేందుకు కండీషన్లు పెట్టారు. ఈ నేపథ్యంలో నిధుల సమీకరణ రేవంత్‌కు సవాల్‌గా మారింది.శాఖల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్న ఆయా శాఖల నుంచి రావాల్సిన బకాయిలు సమీకరిస్తున్నారు. ఈ క్రమంలో భూముల విలువ పెంపుపైనా దృష్టి పెట్టారు. భూముల విలువ పెంచడం ద్వారా రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఖజానాకు వచ్చే ఆదాయంలో మద్యం మొదటి స్థానంలో ఉండగా, రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం తర్వాతి స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలోనే భూముల విలువ పెంచాలని రేవంత్ సర్కార్ భావిస్తోంది. తద్వారా భారీగా ఖజానాకు నిధులు వస్తాయని అంచనా వేస్తోంది.భూముల విలువ పెంపు విషయంలోనూ రేవంత్‌రెడ్డి జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏపీలో 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌మోహన్‌రెడ్డి మూడు నాలుగుసార్లు భూముల విలువలు సవరించారు. దీంతో ప్రభుత్వానికి ఆదాయం పెరిగింది కానీ, సామాన్యులకు ఎలాంటి లబ్ధి కలుగలేదు. దీంతోపాటు ల్యాడ్ టైటిలింగ్ యాక్ట్ అమలు కూడా మొన్నటి ఎన్నికల్లో జగన్ ఓటమికి కారణమయ్యాయి.భూముల విలువ పెంపు అంటే .. డిమాండ్ ఉన్న ప్రాంతాల్లోనే పెంచాలి. డిమాండ్ లేని ప్రాంతాల్లో భూముల విలువ పెంచితే అది ప్రభుత్వంపై వ్యతిరేకతకు దారితీస్తుందని నిపుణులు అంటున్నారు. ఇందుకు జగన్ చేసిన ప్రయోగమే నిదర్శనమంటున్నారు. జూన్ 15 లేదా 18న నిర్వహించే కేబినెట్ మీటింగ్‌లో భూముల విలువలు సవరించే అవకాశం ఉందని తెలుస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## జూలై 24న కేంద్ర బడ్జెట్

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల తర్వాత వచ్చే ప్రభుత్వానికే పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే అధికారం ఉంటుంది. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (ఃఏఖ) సారథ్యంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఔఆం) గెలుపొంది సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే 2014, 2019 మాదిరిగా బీజేపీకి సొంతంగానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే మెజారిటీ రాలేదు. గత రెండు పర్యాయాలు తాము కోరుకున్న రీతిలో బడ్జెట్ ప్రవేశపెడుతూ వచ్చిన మోదీ సర్కారు, త్వరలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్‌పై గుత్తాధిపత్యం కొనసాగిస్తుందా లేక మిత్రపక్షాల డిమాండ్లకు చోటిస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది.కొత్త ప్రభుత్వంలోనూ కీలకమైన ఆర్థిక శాఖ మంత్రిగా నిర్మల సీతారామన్‌ను కొనసాగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయం తీసుకున్నారు. ఆర్థిక శాఖ మంత్రిగా ఆమె ఇప్పటికే 6 పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్ 7వది. బడ్జెట్ రూపకల్పన సందర్భంగా వివిధ వర్గాలతో సమావేశాలు నిర్వహించడం, వారి ఆకాంక్షలను తెలుసుకుని తదనుగుణంగా బడ్జెట్ తయారుచేయడం ఆనవాయితీ. ఆ ప్రకారం రైతు సంఘాల నుంచి వ్యాపారవర్గాల వరకు అందరినీ కలుస్తుంటారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ మళ్లీ మొదలైంది. అయితే బడ్జెట్‌పై కోటి ఆశలతో ఎదురుచూసేది మాత్రం వేతన జీవులే. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి సంపాదించిన సొమ్ములో ఆదాయపు పన్ను రూపేణా కేంద్ర ప్రభుత్వం ముక్కుపిండి వసూలు చేయడంతో పాటు పరోక్షంగా అనేక రూపాల్లో పన్నుల దాడికి గురవుతుంటారు. వందలు, వేల కోట్లు ఆర్జించే వ్యాపార, పారిశ్రామిక వర్గాల్లో చాలా వరకు తప్పుడు లెక్కలు చూపించి పన్ను ఎగవేస్తుంటారు. ఈ పరిస్థితుల్లో సామాన్య వేతన జీవులు ప్రభుత్వం తమపై మోపుతున్న పన్ను భారాన్ని తగ్గిస్తుందా అని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే 6 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మల సీతారామన్‌పై వేతన జీవులకు సదభిప్రాయం లేదు. ఈసారైనా తమపై కరుణచూపి పన్ను శ్లాబుల్లో మార్పుల రూపంలోనో.. లేక పన్ను మినహాయింపుల రూపంలోనో ఊరట కల్గిస్తారా అని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఇదే మాదిరిగా వ్యవసాయ, వ్యాపార, తయారీ రంగాలవారు కూడా ఈ బడ్జెట్ ద్వారా తమకు లభించే ప్రోత్సాహకాలు, పన్ను రాయితీల గురించి ఎదురు చూస్తుంటారు. దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలంటే ప్రభుత్వం వద్ద దండిగా నిధులుండాలి. ప్రభుత్వ గడించే ఆదాయంలో పన్నులు, సుంకాల రూపంలోనే ఎక్కువగా ఉంటుంది. పన్ను రేట్లు తగ్గిస్తే ఆదాయం తగ్గుతుంది. ఆదాయం తగ్గితే అభివృద్ధి తగ్గుతుంది. కాబట్టి ఇదొక అంతులేని కథలా కొనసాగుతుంది.కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం, స్పీకర్ ఎన్నిక కోసం పార్లమెంట్ ప్రత్యేకంగా సమావేశమవుతుంది. ఈ ప్రత్యేక సమావేశాలు జూన్ 24న ప్రారంభమై జులై 3న ముగుస్తున్నాయి. తొలి రెండు రోజులు (జూన్ 24, 25) కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారంతోనే సరిపోతుంది. మొత్తం 543 మంది సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సభలో సీనియర్ సభ్యుడిని రాష్ట్రపతి ప్రొటెం స్పీకర్‌గా నియమిస్తారు. 18వ లోక్‌సభకు ఎన్నికైన సభ్యుల్లో మధ్యప్రదేశ్‌లోని తికంగఢ్ స్థానం నుంచి బీజేపీ తరఫున గెలుపొందిన వీరేంద్ర కుమార్, కేరళకు చెందిన కాంగ్రెస్ ఎంపీ కొడిక్కున్నిల్ సునీల్ సీనియర్ సభ్యులుగా ఉన్నారు. ఇద్దరూ 8 పర్యాయాలు లోక్‌సభకు గెలుపొందారు. అయితే వీరిలో వీరేంద్ర కుమార్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకున్నందున కాంగ్రెస్ సభ్యుణ్ణి ప్రొటెం స్పీకర్‌గా తీసుకుంటారా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. జూన్ 26న లోక్‌సభ స్పీకర్ ఎన్నికల జరగనుంది. ఈ పదవి కోసం రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీగా ఉన్న దగ్గుబాటి పురందేశ్వరి పేరు రేసులో వినిపిస్తోంది. కేంద్ర మంత్రివర్గంలో ఆమెకు చోటు కల్పించలేదు కాబట్టి 'నారీశక్తి' నినాదంలో భాగంగా ఆమెకు స్పీకర్ పదవి కట్టబెట్టే అవకాశం ఉందన్న విశ్లేషణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే అనూహ్య నిర్ణయాలు తీసుకునే మోదీ-షా ద్వయం ఈసారి స్పీకర్‌గా ఎవరికి అవకాశం కల్పిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.మరోవైపు లోక్‌సభతో పాటు రాజ్యసభ 264వ సెషన్ జూన్ 27 నుంచి ప్రారంభమవుతుంది. అంటే లోక్‌సభ తొలి రెండు రోజులు సభ్యుల ప్రమాణ స్వీకారం, మూడో రోజు స్పీకర్ ఎన్నిక పూర్తిచేసిన తర్వాత రాజ్యసభ మొదలవుతుంది. అదే రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుందని పార్లమెంట్ వర్గాలు వెల్లడించాయి. ప్రతియేటా బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రపతి ప్రసంగించారు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం ఏర్పడ్డ నేపథ్యంలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే రాష్ట్రపతి ప్రసంగం ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ ప్రసంగం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏం చేయదల్చుకుందో చెప్పే ప్రయత్నం చేస్తుంది.

## తెలంగాణలో నాలుగు రోజులు వానలే వానలు..!

**ఈ జిల్లాలకు భారీ వర్ష సూచన**

తెలంగాణలో రాగల నాలుగు రోజులు తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రాయలసీమ నుంచి మధ్య బంగాళాఖాతం వరకు సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు ఏర్పడిన ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది. ఈ క్రమంలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. అలాగే నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే సూచనలున్నాయని చెప్పింది. అలాగే ఈ నెల 19 వరకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..

తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా పలువురు కలెక్టర్లను కూడా మర్చారు. కొత్త ప్రభుత్వం వచ్చిన ఆరు నెలలకే తెలంగాణలో జిల్లా కలెక్టర్లను మారుస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మొత్తం 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. బదిలీ అయిన ఐఏఎస్‌ల వివరాలు కింది విధంగా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్‌ను ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా, మంచిర్యాల జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా, ట్రాన్స్‌కో జేఎండీ సందీప్ కుమార్ ఝాను రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, అనురాగ్ జయంతిని కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా, నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌ను కామారెడ్డిజిల్లా కలెక్టర్‌గా, జితేష్ వి పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్‌గా, రాహుల్ శర్మను జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా, హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా, పీ ప్రావీణ్యను వరంగల్ జిల్లా కలెక్టర్ నుంచి హన్మకొండ జిల్లా కలెక్టర్‌గా, సత్యప్రసాద్‌ను ఖమ్మం అదనపు కలెక్టర్ నుంచి జగిత్యాల కలెక్టర్‌గా బదిలీ చేశారు. కోయ శ్రీహర్షను పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌గా, విజయేంద్ర బోయిని మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా, కుమార్ దీపక్‌ను మంచిర్యాల కలెక్టర్‌గా, ప్రతీక్ జైన్‌ను వికారాబాద్ కలెక్టర్‌గా, నారాయణరెడ్డి వికారాబాద్ కలెక్టర్‌గా, ఆదర్శ సురభిని వనపర్తి జిల్లా కలెక్టర్‌గా, తేజస్ నంద్‌లాల్‌ను సూర్యాపేట జిల్లా కలెక్టర్‌గా, సత్య శారదాదేవిని వరంగల్ జిల్లా కలెక్టర్‌గా, టీఎస్ దివాకరను ములుగు జిల్లా కలెక్టర్‌గా, అభిలాష అభినవ్‌ను నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు

# నా సగం జీవితం నటిగానే గడిపా



తెలుగు చిత్రం 'బోణి'తో సినీరంగంలో అడుగుపెట్టింది కథానాయిక కృతి కర్బందా. చిత్రసీమలో రాణిస్తూ..తాజాగా 15ఏళ్లను విజయవంతంగా పూర్తిచేసుకుందీమె. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా తనకు ప్రేమను పంచిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపింది. 'ఇన్నేళ్లలో నా సగం జీవితం నటిగానే గడిపాను. నటనపై నాలో నాకే తెలియని ఓ అభిరుచి ఏర్పడింది. ఈ మధ్యలో ఎన్నో మరపురాని అనుభావాల్ని సంపాదించుకున్నా.కన్నడలో నేను చేసిన 'గూగ్లీ' విడుదలైన సమయమది. అందులో నేను డాక్టర్ స్వాతిగా కనిపిస్తా. ఒకరోజు షాపింగ్ కోసం మాల్‌కి వెళ్లాము. అక్కడున్న వాళ్లంతా నన్ను గుర్తుపట్టి 'డాక్టర్ డాక్టర్' అని పిలవడం మొదలుపెట్టారు. అస్సలు నమ్మలేకపోయాను. ఊహించలేదు కూడా. ఆనందంతో పొంగిపోయా. అప్పుడు పరిశ్రమలో నాకున్న క్రేజ్ ఏమిటో అర్థమైంది' అని ఒక జ్ఞాపకాన్ని గుర్తుచేసుకుంది. 'ఈ అద్భుతమైన ప్రయాణంలో భాగమైన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. నా కుటుంబం, నా భర్త, స్నేహితులు..అన్నింటికంటే నా ప్రతిభను గుర్తించి, నమ్మకంతో నాకు అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలు, నాపై ప్రేమను కురిపిస్తున్న అభిమానులకు థాంక్యూ' అంటూ రాసుకొచ్చింది కృతి. ఇటీవలే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన ఈమె 'రిస్కీ రోమియో'తో త్వరలో సందడి చేయనుంది.




## అల్లు అర్జున్ 'పుష్ప 2' వాయిదా? రేసులోకి రామ్ 'డబుల్ ఇస్మార్ట్'!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్ పుష్ప 2. బ్లాక్ బస్టర్ చిత్రం 'పుష్ప: ది రైజ్' కు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతుంది. సుకుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రష్మిక కథానాయికగా నటిస్తుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుంది. ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. అయితే షూటింగ్ ఇంకా పెండింగ్ ఉండటంతో ఈ సినిమా విడుదల వాయిదా పడనున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలు నిజం అని తెలుస్తుంది. ఎందుకంటే ఈ రేసులోకి మరో స్టార్ హీరో వచ్చి చేరాడు. టాలీవుడ్ ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబోలో వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లో డబుల్ ఇస్మార్ట్ ఇస్మార్ట్ శంకర్‌కు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటించారు. ఈ సినిమాను ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు పోస్టర్ విడుదల చేశారు. దీంతో పుష్ప మూవీ విడుదల వాయిదా పడుతుందని వస్తున్న వార్తలకు బలం చేకురినట్లయింది.



# రమ్యకృష్ణ 30ఏళ్ల సినీ ప్రయాణం



రమ్యకృష్ణ తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచేయం అవసరంలేని పేరు. ఇప్పుడున్న సినీ ప్రియులకు ఆమె ఓ శివగామి. కానీ 90' అడియన్స్ కు కంటిచూపుతోనే భయపెట్టే ఓ నీలాంబరి.నిజమే మరీ.. అందమే కాదు.. కళ్లతోనూ అద్భుతంగా నటించే హీరోయిన్. ఎలాంటి పాత్రకైనా తనదైన నటనతో ప్రాణం పోసే నటి. ఎన్నో లు.. మరెన్నో పాత్రలు ఆమెను తెలుగు వారికి దగ్గర చేశాయి. 1967 సెప్టెంబర్ 15న చెన్నైలో జన్మించిన రమ్యకృష్ణ.. 1990 నుంచి 2000 వరకు దాదాపు దశాబ్ద కాలంపాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీలో అనేక ల్లో నటించి మెప్పించింది. చిన్న వయసులోనే నటిగా సినీరంగంలోకి అడుగుపెట్టి ఎనిమిదో తరగతి చదువుతూనే వెళ్లె మనసులో ప్రధాన పాత్ర పోషించింది. ఆ తర్వాత బాల మిత్రులు తో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమయ్యింది. తెలుగులో దాదాపు అందరు స్టార్ హీరోలతో నటించింది. మెగాస్టార్చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేశ్, నాగార్జున, రాజశేఖర్, మోహన్ బాబు వంటి స్టార్ హీరోలతో స్క్రీన్ షేర్ చేసుకుంది.హీరోయిన్ గానే కాకుండా విలన్ క్యారెక్టర్స్ కూడా అదరగొట్టింది. రజినీకాంత్, సౌందర్య జంటగా నటించిన నరసింహ లో నీలాంబరి పాత్రలో అద్భుతమైన నటనతో కట్టిపడేసింది. ఈ రమ్యకృష్ణకు మంచి పేరు తెచ్చిపెట్టింది. చాలాకాలం పాటు కథానాయికగా నటించిన రమ్యకృష్ణ యంగ్ హీరోల ల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. ప్రస్తుతం తల్లిగా నటిస్తుంది. దాదాపు 30 ఏళ్లకు పైగా సినీ పరిశ్రమలో కొనసాగుతుంది రమ్యకృష్ణ. యంగ్ రెబల్ స్టార్ప్రభాస్, రాజమౌళి కాంబోలో వచ్చిన బాహుబలి లో శివగామి పాత్రలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది.

# లేడీ బాస్ నీరా వాసుదేవ్

లేడీ బాస్ నీరా వాసుదేవ్హీరో నితిన్ నటిస్తున్న యూనిక్ యాక్షన్, హీస్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'రాబిన్‌హుడ్'. ఇందులో శ్రీలీల ఫిమేల్ లీడ్ రోల్ పోషిస్తుంది. వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. శ్రీలీలకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మేకర్స్ ఆమె పాత్రను లేడీ బాస్ నీరా వాసుదేవ్‌గా పరిచయం చేశారు. శ్రీలీల టైట్ సెక్యూరిటీతో ప్రైవేట్ జెట్‌లో దిగినట్లు ఈ వీడియో ప్రజెంట్ చేస్తోంది. ఆమె వెయిట్ తెలియకపోయినా హెడ్ వెయిట్ ఇన్ఫినిటీ. ఆమె యారోగెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తుంది. టీజర్‌లో 'జ్యోతీ, సునామీలో టి సైలెంట్ ఉండాలి%ౌ% నా ముందు నువ్వు సైలెంట్‌గా ఉండాలి' అని శ్రీలీల చెప్పిన డైలాగ్ అలరించింది. మూవీలో నితిన్ పాత్రకు శ్రీలీల పాత్ర పూర్తి భిన్నంగా ఉంటుంది. విజువల్స్ గ్రాండ్‌గా అనిపించాయి. ప్రొడక్షన్ వాల్యూస్ టాప్-క్లాస్‌గా ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 20న ఈ సినిమా విడుదల కానుంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com